www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 33 | 15-05-2023 | పుటలు : 4

# నన్నయ వీసీగా ఆచార్య కె.పద్మరాజు బాధ్యతల స్వీకరణ



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా
బాధ్యతలు స్వీకరించిన
ఆచార్య కె.పద్మరాజు గారికి శుభాకాంక్షలు!!
- నన్నయవాణి

**13.05.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఐదవ ఉపకులపతి గా ఆచార్య కె.పద్మరాజు బాధ్యతలు స్వీకరించారు. శనివారం యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఆచార్య కె.పద్మరాజు కు ఘనంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలోని నన్నయ విగ్రహాలకు, డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పద్మరాజు పూలమాలికలు వేసి నివాళు లర్పించారు. వేదపండితులు పూర్ణకుంభంతో, ఎన్.సి.సి వారు గాడ్ ఆఫ్ హానర్ తో, విశ్వవిద్యాలయ సిబ్బంది పరివారంతో కుటుంబ సమేతంగా వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో ప్రవేశించారు. ఇన్చార్జ్ వీసీ జి.వి.ఆర్. ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ సమక్షంలో ఆచార్య కె.పద్మరాజు అధికార పత్రాలపై సంతకాలు చేసి వీసీ గా బాధ్యతలను స్వీకరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె.పద్మరాజు కు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలను తెలియజేసారు. తరువాత ఈసీ హాల్ లో ఇన్చార్జ్ గా నన్నయ విశ్వవిద్యాలయానికి సేవలందించిన జె.ఎన్.టి.యు.కె. వీసీ జి.వి.ఆర్. ప్రసాదరాజు ను నన్నయ విశ్వవిద్యాలయ అధికారులంతా సన్మానించి వీడ్కోలు తెలిపారు.

యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో విశ్వవిద్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వీసీ గా నియమించిన ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు వై.ఎస్.జగన్మోహనరెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, చీఫ్ సెక్రటరీ శ్యామలరావు ఐ.ఏ.ఎస్., ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేసారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై చేస్తున్న ఖర్చును ఖర్చుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్ కు పెట్టుబడిగా భావిస్తున్నారని, దానికి తగినట్టుగా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎక్కువ అనుబంధ కళాశాలలతో పెద్ద విశ్వవిద్యాలయంగా పేరుపొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. ఎటువంటి తారతమ్యాలు లేకుండా సమష్టి కృషితో పని చేస్తేనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఎన్నో వనరులు, వసతులు ఉన్నాయని వాటిని ఉపయోగించుకుంటూ విశ్వ విద్యాలయాన్ని ముందుకు తీసుకు వెళ్దామన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బంది అంతా క్రమశిక్షణతో విశ్వవిద్యాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలన్నారు.. విశ్వవిద్యాలయం నుండి బయటకు వెళ్ళే విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సంపాదించుకొని తీసుకువెళ్లాలని అన్నారు. విశ్వ విద్యాలయ సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేసారు. అనంతరం విశ్వ విద్యాలయ కేంద్ర పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రూమ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.




వీసీ గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య కె పద్మరాజు




వీడియో కాన్ఫరెన్స్ రూమ్ ను ప్రారంభిస్తున్న వీసీ



నన్నయ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలికలను సమర్పించిన వీసీ ఆచార్య పద్మరాజు.



# సంపాదకీయం




## టీచర్

విద్య సామాజిక రుగ్మతలకు చికిత్స.అధ్యాపకులు భూత కాలాన్ని వర్తమానంతో అన్వయించి భవిష్యత్తుతో కలిపే వారధులు. ఉత్తమమైన అధ్యాపకుల చేతిలో శిక్షణ పొందిన చదువు దివ్యమైనదౌతుంది.టీచర్,విద్యార్థి అధ్యయనం,అధ్యాపనం ఈ రెండిటి ద్వారానే ప్రకాశిస్తారు.సచ్ఛీలం,సత్ప్రవర్తన అనేవి విద్యా ఫలాలు.

బోధన,అధ్యయనాలు కేవలం తరగతి గదులకే పరిమితం కాదు. పుస్తక ప్రపంచంలోంచి ప్రపంచ పుస్తకంలోకి నిరంతరం చూస్తుండాలి.అటువంటి జ్ఞానమే గొప్ప సమాజాన్ని నిర్మిస్తుంది.ఉపాధ్యాయునికి గురువని,అధ్యాపకుడని ఆచార్యుడని వివిధ రకాల పేర్లున్నాయి.ఏ పేరుతో పిలిచినా అతనికి సమాజంతో ఉన్న సంబంధం శాశ్వతం.మంచి ఉపాధ్యాయుడు వెలుగుతున్న దీపం.ఎన్నో దీపాల్ని వెలిగించాలి.

సమాజ మార్గదర్శకుడైన టీచర్ ప్రభావం విద్యార్థిమీద తీవ్రంగా ఉంటుంది.టీచర్ ఆచరణ ఇతరులకుస్ఫూర్తిదాయకమైంది. 'ఆచరణేతి ఇతి ఆచార్యః' అని వ్యుత్పత్తి. ఆచరణ చాలా కీలకమైన అంశం. విద్యార్థిని సృజనాత్మకంగా ఆలోచించే దిశగా నడిపించాలి.స్వతంత్రంగా ఆలోచించేందుకు తగిన పునాదిని వేయాలి.దిశానిర్దేశం చేయగల తాత్వికమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలి.

బోధన కేవలం యాంత్రికమైన కలాపంకాదు. కంప్యూటర్, ప్రొజెక్టర్, మెటీరియల్ బోధనోపకరణాలు మాత్రమే. బోధన క్రియాశీలమైన కార్యం. అదొక చైతన్యవంతమైన రూపం. విద్యార్థి మానసిక వికాసానికి చేసే కృషి. తనచుట్టూఉన్న సమాజాన్ని ప్రభావితం చేసే విభిన్నమైన పాత్ర. నేర్పడంతో పాటు నేర్చుకునే గుణం ఉన్న ప్రత్యేకమైన వ్యక్తిత్వం. ఈ లక్షణాలు మాత్రమే టీచర్ ని లోకానికి గొప్పగా పరిచయం చేస్తాయి.

వెనక్కి చూస్తే చరిత్రను ప్రభావితం చేసిన టీచర్లు కనిపిస్తారు. జీవితాన్ని వెలిగించిన,తీర్చిదిద్దిన టీచర్లు దర్శనమిస్తారు.భవనాలు, ఆధునిక సాంకేతిక సౌకర్యాలు గొప్ప విద్యాలయాన్ని సృష్టించలేవు.బోధనని వృత్తిగా మాత్రమే కాక సృజనాత్మక విన్యాసంగా స్వీకరించగలిగిన వారి వల్లనే అది మహోన్నత విద్యాలయమౌతుంది.

బోధన ఒక కళ. బోధన, అధ్యయనాలు ఒక వ్యామోహం. ఉత్సాహ, ఉద్విగ్న భరితంగా తరగతి గదుల్ని సృష్టించే టీచర్లే విద్యార్థులకు గొప్ప మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, ప్రేరేపిస్తూ స్ఫూర్తిదాయకంగా వెలుగొందుతారు. జ్ఞానాన్వేషణలో నిత్య విద్యార్థులైన టీచర్లు దేశానికి అనధికార శాసనకర్తలవుతారు.

**ఆచార్యదేవోభవ!**



ఆచార్య పద్మరాజు గారికి ఎన్.సి.సి. గౌరవ వందనం,ఆహ్వానం.










కుటుంబ సభ్యుల అభినందనలు




## మంచి మాట

### పరోపకారార్థమిదం శరీరం!

ఇతరుల కొరకే చెట్లు పళ్ళనిస్తున్నాయి. నదులు నీటినిస్తున్నాయి. గోవులు పాలనిస్తున్నాయి. ఈ శరీరాలు పరోపకారార్థం కోసం కూడా వినియోగించాలి.

\- భర్తృహరి




ఆచార్య ప్రసాదరాజు అభినందనలు.


ఆదిత్య విద్యాసంస్థల అభినందనలు.







## విశ్వవిద్యాలయ అధికారులు,వివిధ విభాగాల ఆచార్యులు,సిబ్బంది అభినందనల చిత్ర మాలిక










































విశ్వవిద్యాలయ సిబ్బందితో సమావేశం







# నన్నయ అధికారులతో విసి రివ్యూ



**14.05.23 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిపై విశ్వవిద్యాలయ అధికారులతో వీసీ ఆచార్య కె. పద్మరాజు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు.ఆదివారం యూనివర్సిటీ ఈసీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్స్,కోఆర్డినేటర్స్ హాజరై తమ విభాగాల కార్యక్రమాలను ప్రణాళికలను వివరించారు. దీనిపై వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో పయనించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అందరూ కలిసి పనిచేస్తే విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



# అమ్మకు వందనం

**మే 2న ఆదివారం**
**అంతర్జాతీయ మాతృ దినోత్సవ**
**శుభాకాంక్షలు!!**

అమృతం ఆయుష్షు పోస్తుందో లేదో తెలియదు కానీ అమ్మ మాత్రం తన ఆయుష్షును బిడ్డకే అందిస్తుంది.నవ మాసాలు తన కడుపులో కదలాడే బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకొని నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటుంది.”జననం నీవే..గమనం నీవే..సృష్టివి నీవే..కర్తవు నీవే..కర్మవో నీవే..ఈ జగమంతా నీవే”
అందుకే భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మని సృష్టించాడేమో!సృష్టికి ప్రతి సృష్టిని ఇచ్చి ప్రేమతో ప్రాణం పోసేది అమ్మే కదా.తొలి అడుగు తానై నడిపించేది, మనకు ఓర్పును,నేర్పును, ఓదార్పును ఇచ్చేది అమ్మ మాత్రమే.ప్రపంచంలో అతి పేదవాడు అంటే డబ్బు లేని వాడు కాదు అమ్మ ప్రేమ లేనివాడు.అమ్మ ప్రేమ దక్కినవాడు అత్యంత కోటీశ్వరుడు.మనకు జన్మనిచ్చి మన సమాజ నిర్మాణానికి దోహదం చేసే అమ్మను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకే అమ్మ కోసం ఒక రోజు ప్రత్యేకంగా ఉండాలనే ఉద్దేశంతో మే 2వ ఆదివారం నాడు “అంతర్జాతీయ మాతృదినోత్సవం” గా జరుపుకుంటున్నాము.దీనికి ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది.గ్రీస్ దేశంలోని ‘రియా’ అనే దేవతను “మదర్ ఆఫ్ గాడ్” గా భావించి ఏడాదికోసారి నివాళులు అర్పించేవారు.
అలాగే 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్ లో తల్లులకు గౌరవంగా ‘మదరింగ్ సండే’ గా జరిపేవారు.1872 లో అమెరికాలో ప్రపంచశాంతి కోసం మదర్స్ డే జరుపుకోవాలని మేరీ జర్విన్ అనే మహిళ ఎంతగానో కృషి చేశారు.
ఈమె 1905 మే 9న మరణించడంతో ఆమె కూతురు మిస్ జర్విన్ మాతృ దినోత్సవము కోసం విస్తృతంగా కృషి చేశారు. ఇలా 1911 నాటికి అమెరికా లోని అన్ని రాష్ట్రాల్లో మాతృ దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించారు.అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ 1914 నుంచి అధికారికంగా మాతృ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రతిపాదించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించి మే రెండవ ఆదివారం నాడు అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.
ఈ ప్రపంచంలో ఎన్ని బంధాలు ఉన్నా మాతృమూర్తితో ఉన్న అనుబంధం చాలా గొప్పది.
అమ్మ రోజంతా ఎన్ని బాధ్యతలు నిర్వహించిన ఇంటికి అధిక ప్రాధ్యానత ఇచ్చి కుటుంబ అవసరాలు తీర్చడంలో ప్రధానపాత్ర వహిస్తుంది. మనం ఎంత కాదనుకున్నా మనకు జీవితాంతం తోడుగా నిలిచేది అమ్మ ప్రేమ ఒక్కటే.
అందుకే “ఢిల్లీకి రాజైన అమ్మకు మాత్రం కొడుకే”అనే సామెత వచ్చింది.కనుక అమ్మ కోసం సంవత్సరములో ఒకరోజు మాతృ దినోత్సవం జరుపుకోవడం, బహుమతులు ఇవ్వడం కాదు..సంవత్సరంలోని అన్ని రోజులు మన మాతృమూర్తి ని కంటికి రెప్పలా కాపాడుకొని దైవంలా చూసుకోవాలి.ఇదే అమ్మకు మనమిచ్చే అత్యంత విలువైన బహుమతి. మన కోసం పాటుపడే తల్లులందరికీ నమస్సులు అర్పించుకుంటూ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు.



**- బి.సుశాంత్ కుమార్**